


# మగవాడు

వాళ్ళకి హైద్రాబాద్ రావటం అదే మొదటిసారి. దక్షిణ్ ఎక్స్‌ప్రెస్ లోంచి సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో దిగాక ముందర సామాన్లు లెక్క చూసుకుంది. మూడైప్ రెండేళ్ళుంటాయి. ఆమె పక్కనే ఇద్దరు పిల్లలున్నారు. ఎదాలాపంగా ఆమె వంక చూసాను. ఫర్వాలేదు అనిపించే అందం.

ఇటార్సీనించి వచ్చే ఓ స్నేహితుడ్ని రిసీవ్ చేసుకోడానికివచ్చాను. ప్లాట్‌ఫాం మొత్తం నాలుగైదుసార్లు తిరిగి చూసాను కాని వాడు కనబడ లేదు.

రాలేదన్న సంగతి నిర్ధారణ చేసుకున్నాక మనసులో తిట్టుకున్నాను వాడిని, చలిలో వుదయమే లేచి పది కిలో మీటర్లు వాడికోసం రావలసి వచ్చినందుకు

ఆఖరిసారి చూసి రైల్వే రెస్టరెంట్‌లోకి వెళ్ళాను, ఒకవేళ అక్కడ వున్నాడేమోనని.

లేడు.

టీ తాగుతూ చూసాను వాళ్ళ వంక ఆ ప్రౌఢ, ఆమె ఇద్దరుపిల్లలు టీ తాగుతున్నారు. చుట్టూ సామాను వుంది.

ఆమె కూడా వెదుకుతున్నట్లుగా చూస్తోంది అందరి వంకా కాసేపు అలా చూసాక ఆమె చూపులు నా మీద నిలిచిపోయాయి గబగబ టీ తాగి లేచి నా దగ్గరకవచ్చి అన్నది

"ఎక్స్‌క్యూజ్ మి"

"యస్ ?" అడిగాను.

"నా పేరు మణి. నాగ్‌పూర్ నించి వస్తున్నాను. మా బంధువులు వచ్చి మమ్మల్ని రిసీవ్ చేసుకోవాలి నాకు హైద్రాబాద్ కొత్త. వాళ్ళు ఇంతదాకా రాలేదు కాస్త హెల్ప్ చేయగలరా ?" అడిగింది

తలవూపి చెప్పాను. ఎదురుగా వున్న కుర్చీని చూపిస్తూ.

"కూర్చోండి"

ఆమె భర్తకి గోండియాలో రైల్వేలో వుద్యోగం. సంతోష్ నగర్‌లో ఆమె అక్కయ్య, బావ వుంటున్నారు. బావగారు మిథానిలో పని చేస్తున్నారు వస్తున్నట్లుగా వారం క్రితమే వుత్తరం రాస్తే, స్టేషన్‌కి ఆ రోజు వచ్చి రిసీవ్ చేసుకుంటామని సమాధానంగా టెలిగ్రాం కూడా పంపించారు. ఆ ధైర్యంతో బయలుదేరింది ఆవిడ తన ఇద్దరు పిల్లలతో.

సంతోష్‌నగర్ ఎక్కడో తెలియదు నాకు. కాని ఆమెకి సహాయం చేయకుండా వుండలేక పోయాను

"చిరునామా వుందా ?" అడిగాను.

హేండ్ బేగ్‌లోంచి ఓ కాగితం తీసి అందించింది నిశ్శబ్దంగా చదివాక చెప్పాను

"బయల్దేరదాం"

"సామాను..."

రైల్వే పోర్టర్ బయటకి తీసుకొచ్చాను ఆటో డ్రైవర్‌ని అడిగితే నాపదానికి వెంటనే వప్పుకున్నాడు

"థాంక్సండి..." చెప్పిందామె ఆటో బయలుదేరాక.

"వెల్‌కం" చెప్పాను.

పిల్లలిద్దరికీ చొరవ ఎక్కువలాగుంది. 'అంకుల్' అంటూ నాతో మాటలు కలిపేసారు.

ఆమె పోలికే పిల్లలకి. ఏదో ఒకటి మాట్లాడుతూనే వుంది. సైదాబాద్ పోలీస్‌స్టేషన్ పక్కనించి వెళ్తుంటే అనుకున్నాను, సంతోష్ నగర్ అంతదూరమా అని.

చివరికి ఆమె అక్కయ్య ఇల్లు చేరుకున్నాం ఏమే ఎలా వచ్చావ్ ఒక్కదానివి ?' ఆశ్చర్యపోయింది ఆవిడ. మణిది అక్కయ్య పోలికలే.

"చెప్తాను" నవ్వుతూ లోపలికి వెళ్ళింది,

కాఫీ, టిఫిన్ తీసుకున్నాక వెళ్తానని లేచాను.

"కూర్చోండి" చెప్పింది మణి.

"నేను ఆఫీస్‌కి వెళ్ళాలి-"

"మీరు ఇందాక పోర్టర్ కిచ్చిన డబ్బు, ఇప్పుడు ఆటోకిచ్చినడబ్బు తీసుకోండి ముందు"

"ఫర్వాలేదండి "

"అలాకాదు... అక్కయ్యా. చూసావుగా. మీ మరిది వస్తే నేనే గెలిచానని చెప్పాలి "

"ఆయనేడి అడగడం మరిచాను.

నా వంక తిరిగి చెప్పింది మణి కొద్దిగా మొహమాటపడుతూ

"మీరు నన్ను క్షమించాలి జరిగింది చెప్తాను రైల్లో వస్తూ మీ ఆయనా, నేనూ బెట్ వేసుకున్నాం. ఇందాక నేను అడిగినలాంటిసహాయం చేయడానికి ఆడవాళ్ళ కోసం ముందుకు వచ్చినట్లుగా మొగవాళ్ళ కోసంరారని. అది అబద్ధంఅన్నారు. బెట్ వేసుకున్నాం.

పిల్లలతో నేను జాగ్రత్తగా ఆయనకన్నా ముందర ఇంటికి చేరుకోగలం అని బెట్‌కాసాను. రైలు దిగాక ఎవరిదోవ వారు పట్టాం. మేం వుత్తరం రాయలేదు వస్తున్న సంగతి'



తెల్లబోయాను ఆ మాటలు విన్నాక.

"దాందేముంది. ఓ మనిషికి మరో మనిషి సహాయం చేయడమే ఇది" అన్నాను.

"కాదు. నిజం చెప్పండి. జీవితంలో ఈ ఒక్కసారి ఫ్రేంక్‌గా చెప్పండి జవాబు మీ ఆయనే నా పరిస్థితుల్లో ఎదురయితే ఇంత శ్రద్ధ తీసుకునేవారా ?"

నవ్వాను.

సికిందాబాద్ రైల్వే స్టేషన్‌కి వెళ్ళి, స్టాండ్‌లోని నా మోటార్ సైకిల్ తీసుకుంటూ అనుకున్నాను.

'ఏమిటీ ప్రవృత్తి ? ఆటోలో ఆమెపక్కన కూర్చుని వెళ్ళినంత మాత్రాన నాకేం జరిగిందని ఈపని చేసాను ?'

*